క్లుప్తంగా...

తారిఖ్ ఇనామ్‌కు పీహెచ్‌డీ డిగ్రీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి ఎం డి.తారిఖ్ ఇనామ్‌కు సోషల్‌వర్క్ విభాగంలో బుధవారం పీహెచ్‌డీ ప్రకటించారు. ఆయన సోషల్ వర్క్ విభాగం ప్రొఫెసర్ ఎం.డి.షాహిద్‌రజా పర్యవేక్షణలో 'కుటుంబ నియంత్రణపై మగవారి జ్ఞానం, వైఖరి, అభ్యాసాలు: కిషన్ గంజ్ జిల్లా బిహార్ అధ్యయనం' అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

కొవిడ్ పరీక్షలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి, రాయదుర్గం యూపీహెచ్‌సీలో కొవిడ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన పరీక్షల్లో జీరో పాజిటివ్ అని మెడికల్ ఆఫీసర్ శైలజ కీర్తి తెలిపారు. శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో ఆరు మందికి, రాయదుర్గం కేంద్రంలో 5 మందికి పరీక్షలు చేయగా నెగటివ్ వచ్చినట్లు తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి . బుధవారం 38 మందికి ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. 37 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించారు.

హఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో నిల్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నలుగురికి కరోనా పరీక్షలు నిర్వహించగా జీరో పాజిటివ్ అని వైద్యులు పేర్కొన్నారు.

ఇంటి పనుల్లో భాగం పంచుకునే భర్తలు 27శాతం...

సాక్షి, సిటీబ్యూరో: ఇంటిపనులు ఆడవారి బాధ్యతే అని భావిస్తున్న పురుషులే ఇప్పటికీ ఎక్కువ ఉన్నారు. ఈ విషయాన్ని ఏరియల్ ఇండియా నగరంతో పాటు పలు మెట్రోల్లో నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. మహిళలపై పనిభారం తగ్గించాలంటూ సెలబ్రేట్ ఈక్వల్‌- ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న పి అండ్ జి ఆధ్వర్యంలోని ఈ సంస్థ 27 శాతం మంది భర్తలు మాత్రమే పండుగలు, వేడుకల సందర్భాల్లో బాధ్యతలు పంచుకుంటున్నారని తేల్చింది. దీని వల్ల తాము ఏ వేడుకనూ సంపూర్ణంగా ఆస్వాదించలేకపోతున్నట్టు 61 శాతం మంది మహిళలు వాపోతుంటే, ఇంటి పని మహిళల బాధ్యతేనని 41శాతం మగవారు భావిస్తున్నారని స్పష్టం చేసింది.

తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి



మాదాపూర్: తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే పిల్లలు రాణిస్తారని తెలంగాణ రాష్ట్ర జీవ వైవిధ్య శాఖ సంచాలకులు ఎ. నర్సింహారెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో బుధవారం రవీంద్రభారతి విద్యాసంస్థల వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులు అమ్మ గొప్పతనం , రైతు, సైనికుల ప్రాముఖ్యతను తెలిపే నాటికలను వేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డీన్ శ్రీలత, ప్రిన్సిపాల్స్ హైమ, పూర్ణిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



సిద్దిఖీనగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్

గచ్చిబౌలి: ప్రజల అవసరాలకు తగ్గట్లుగా కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిఖీనగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. పైపులైన్లు చిన్నవిగా ఉండటంతో సమస్యలు తలెత్తడంతో పైపులైన్ మార్చాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బజవరాజు, ఫాజిల్, నందు, సాగర్, గణపతి, విజయ్, ఆనంద్ పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



హఫీజ్‌పేట్ : రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు శంభీపూర్ రాజుకు బుధవారం హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్ ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తాండ్ర వెంకటేష్ గౌడ్, మల్లేష్ గౌడ్, శ్రీధర్ గౌడ్‌లు ఉన్నారు.



లింగంపల్లి రైల్వే స్టేషన్



లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఆదర్శ రైల్వే స్టేషన్‌గా లింగంపల్లి

- స్పష్టం చేసిన కేంద్ర రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్
- ఏటేటా పెరుగుతున్న రైళ్లు.. సౌకర్యాలు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్ 'ఆదర్శ స్టేషన్ పథకం'కు ఎంపికైంది. దీంతో పలు సౌకర్యాలను కల్పిస్తున్నారు. నగర శివారులో అత్యధికంగా ప్రయాణికులు, రైళ్ల రాకపోకలు నిర్వహించే స్టేషన్‌గా గుర్తింపు సాధించింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఉద్గీర్ రైల్వేస్టేషన్ వరకున్న స్టేషన్లలో లింగంపల్లి, శంకర్‌పల్లి, తాండూరు, వికారాబాద్, ఉద్గీర్ రైల్వేస్టేషన్లను 'ఆదర్శ స్టేషన్ పథకం' కింద గుర్తించి ప్రయాణికులకు పలు రకాల సౌకర్యాలను కల్పించినట్లు చేవెళ్ల పార్లమెంటు సభ్యులు డాక్టర్ రంజిత్‌రెడ్డికి ఇటీవల కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ లిఖిత పూర్వక సమాధానం ఇవ్వడం విశేషం. లింగంపల్లి రైల్వేస్టేషన్ శేరిలింగంపల్లి నియోజకవర్గంతో పాటు, చుట్టూరా ఉండే నియోజకవర్గాలకు చేరువలో ఉండడంతో ప్రయాణికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దీనికితోడు ఇక్కడి నుంచే ఎంఎంటీఎస్ రైళ్లు ప్రారంభం కావడంతో శివారు ప్రజలకు, దూర ప్రాంతాలకు వెళ్ళే వారికి ప్రధాన స్టేషన్‌గా మారింది. ఈ క్రమంలో లింగంపల్లి నుంచి ఆర్టీసీ బస్సులను మరింతగా పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రధాన రైల్వేస్టేషన్ భవనం వైపు రాకపోకలు సాగించే రోడ్డు విస్తరణతో పాటు కూడలిని విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్

పెరిగిన రాకపోకలు..

- ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జిసిటీ ఉండడం, రెండు జాతీయ స్థాయి యూనివర్సిటీలు, శిక్షణ కేంద్రాలు ఉండడంతో రైల్వేస్టేషన్‌కు రాకపోకలు పెరిగాయి.
- రోజుకూ 25 నుంచి 30వేల మంది వచ్చే స్టేషన్‌గా గుర్తింపు
- రోజూ 42 ఎంఎంటీఎస్ రైళ్లు రావడం, 42 పోవడం జరుగుతుంటాయి
- రోజూ ఎంఎంటీఎస్ రైళ్లు సికింద్రాబాద్, ఫలక్‌నామా, నాంపల్లికి రాకపోకలు సాగిస్తాయి
- ఇక 11 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 4 వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు లింగంపల్లిలో హాల్టింగ్ ఉంటాయి
- 2 ప్యాసింజర్ రైళ్లు, 14 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రోజూ రాకపోకలు చేస్తాయి
- నారాయణాద్రి, గౌతమి, కోకనాడ, అమరావతి, జన్మభూమి, నర్సాపూర్ రైళ్ళు, ఆదివారం రోజు హమ్ సఫర్ రైలు రాకపోకలు సాగిస్తాయి

ఇటీవల కల్పించిన సౌకర్యాలు ..

- లింగంపల్లి స్టేషన్ ఆదర్శ స్టేషన్‌గా గుర్తింపు పొందడంతో రిజర్వుడు వెయిటింగ్ హాల్, జనరల్ వెయింటింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణం
- కొత్తగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం దీనికి 1,6 ప్లాట్‌ఫారమ్‌లపై ఎస్కులేటర్లు ఏర్పాటు చేశారు.
- పాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జి స్థానంలో 6 మీటర్ల వెడల్పుతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. 1,6 ప్లాట్‌ఫారమ్‌లపై లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. దశల వారీగా అన్ని ఫ్లాట్ ఫారమ్‌లపై లిఫ్టులు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్లాన్ చేస్తున్నారు.
- రైల్వేస్టేషన్ గోడలకు వేసిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భారతదేశ జీడీపీ 2047 నాటికి పెరుగుతుంది

20 ట్రిలియన్ యూఎస్ డాలర్లకు చేరడం ఖాయమన్న ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి చైర్మన్ డా.బిబెక్ దేబ్రాయ్



ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న బిబెక్ దేబ్రాయ్

రాయదుర్గం: భారత్ జీడీపీ వచ్చే 2047 నాటికి 20 ట్రిలియన్ యూఎస్ డాలర్లకు చేరుకోవడం ఖాయమని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ బిబెక్ దేబ్రాయ్ వెల్లడించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ది ఇండియన్ ఎకనామెట్రిక్ సొసైటీ (టీఐఈఎస్) 57వ వార్షిక సదస్సు ప్రారంభ సమావేశంలో ఆయన ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ తలసరి ఆదాయం ప్రస్తుతం 10వేల యూఎస్ డాలర్లుగా ఉంటుందని, జీడీపీ యొక్క సగటు పరిమాణం కూడా దాదాపు 20 ట్రిలియన్ డాలర్లకు చేరుకొని దేశం పరివర్తన చెందిన సమాజంగా మారుతుందన్నారు. టైస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం రామచంద్రన్ మాట్లాడుతూ మారకపు రేటు యొక్క అస్థిరత విదేశీ మారకపు అధికారిక కొనుగోలుతో ప్రతికూలంగా ముడిపడి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ప్రొఫెసర్లు రమణమూర్తి, విఆర్ పంచముఖి, కేఎల్ కృష్ణ, డా.నితిన్‌దేశాయ్, ప్రొ.ఎస్ ఆర్ భానుమూర్తి ప్రసంగించారు.

సాంకేతికత మన జీవితాలను చాలా మార్చింది

రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ న్యూయార్క్ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నవీన్‌రావు



డా.నవీన్‌రావుకు జ్ఞాపికను అందిస్తున్న కాంటినెంటల్ ఆస్పత్రి ఎండీ డా.గురు ఎన్ రెడ్డి

రాయదుర్గం: 21వ శతాబ్దం డేటా అండ్ ఇన్సూరెన్స్‌గా మారుతుందని, సాంకేతికత 20 ఏళ్లలో మన జీవితాలను చాలా మార్చిందని న్యూయార్క్ రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(హెల్త్ ఇనీషియేటివ్) డాక్టర్ నవీన్‌రావు పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో రెండవ వార్షిక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ అలుమ్నీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేము టెలి మెడిసిన్, డిజిటల్ ఆరోగ్యాన్ని వేగవంతంగా స్వీకరించడం జరిగిందని త్వరలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. రోగి రికార్డుల డిజిటలైజేషన్, ధరించగలిగే సాంకేతికతను స్వీకరించడం, కృత్రిమ మేధస్సు మెరుగు, వర్చువల్ రియాలిటీలో ఎక్కువ చొచ్చుకుపోవడంతో డిజిటల్ ఆరోగ్య నమూనా రూపొందించే నాలుగు కీలక అంశాలు అవసరమన్నారు. కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ప్రతి రంగంలోనూ సాంకేతిక పురోగతి అవసరమన్నారు. సాంకేతికత వినియోగంలో కాంటినెంటల్ ఆస్పత్రి ముందంజలో ఉందన్నారు. మెరుగైన ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు, డెస్కులు వితరణ



మాదాపూర్: మాదాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు బుధవారం సికింద్రాబాద్ రౌండ్ టేబుల్ 33, సికింద్రాబాద్ లేడీస్ సర్కిల్ 17 రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా, బెస్ట్ రన్నర్స్ యూఎస్ఏ (స్వచ్ఛంద సంస్థల) ఆర్థిక సహకారంతో మాదాపూర్‌లోని జెడ్‌పీహెచ్‌ఎస్‌కి లక్షా తొంభైవేల రూపాయల విలువైన 50 డెస్కులు, కుర్చీలను అందజేశారు. దుర్గం చెరువు మెట్రోస్టేషన్ వద్ద పాఠశాలలో 6వ తరగతి నుండి 10 తరగతి వరకు 900 మంది విద్యార్థులు ఉన్నారని హెచ్‌ఎం బస్వలింగం తెలిపారు. సికింద్రాబాద్ రౌండ్ టేబుల్ చైర్మన్ సుమన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సామర్థ్యాలపై నమ్మకం ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై కపర్తి లక్ష్మణ్, సికింద్రాబాద్ లేడీస్ సర్కిల్ 17 చైర్‌పర్సన్ మమత తదితరులు పాల్గొన్నారు.

పాలసీ రూపకల్పనలో ప్రణాళికే ముఖ్యం

రాయదుర్గం: పాలసీని రూపొందించేటప్పుడు ప్రణాళిక ప్రాముఖ్యతను గుర్తించాల్సిన అవసరముందని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ) డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లోని భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఆధ్వర్యంలో 'పబ్లిక్ పాలసీ డైలాగ్‌-2023' మొదటి ఎడిషన్ సమావేశం బుధవారం ఖేమ్కా ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూపొందించిన విధానాలను విజయవంతంగా అమలు చేయడం వల్ల జాతీయ విధానాలలో ఇమిడిపోతాయన్నారు. ఒడిశా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి జుగల్ కిషోర్‌మహాపాత్ర మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టుల విధాన రూపకల్పన, అమలు విషయానికొస్తే అందరికీ సరిపోయే ఒక కుక్కీ కట్టర్ మోడల్ ఉండదన్నారు. ప్రధానమంత్రి మాజీ సలహాదారు అమర్జీత్‌సిన్హా మాట్లాడుతూ విధాన రూపకల్పనలో తన అనుభవాలు, క్షేత్రస్థాయిలో విధానాలను అమలు చేయడంలో ఎదురయ్యే సమస్యలను పంచుకున్నారు. టైమ్స్ నెట్‌వర్క్ గ్రూప్ ఎడిటర్ నవికాకుమార్ , ఐఎస్‌బీ ప్రొఫెసర్ అశ్విని చత్రే తదితరులు మాట్లాడారు. భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ డాక్టర్ ఆరుషిజైన్ ప్రారంభకర్తగా ఉన్నారు.

బీజేపీలో చేరిక

గచ్చిబౌలి: బీజేపీని మహిళలు ఆదరిస్తున్నారని శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకులు గజ్జెల యోగానంద్ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు విద్యాకల్పన, ఏకాంత్ గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, సింధురెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి కాంచన కృష్ణ, నాయకురాళ్లు పద్మారెడ్డి, శోభారెడ్డి, రాజిశెట్టి, మేరీ సాల్మన్, విజయలక్ష్మి, వినీతసింగ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన మహిళలతో బీజేపీ సీనియర్ నాయకులు గజ్జెల యోగానంద్ తదితరులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మియాపూర్ : మానసిక ఒత్తిడి భరించలేక ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లాడ్జీలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన తోట రాజీవ్(28) అమీన్‌పూర్‌లోని మాధవపురి హిల్స్ శ్రీనివాస ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. స్థానికంగా ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి విధులు ముగించుకుని నేరుగా చందానగర్‌లోని ఓ లాడ్జిలో 407 గది తీసుకున్నాడు. రాజీవ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా చందానగర్‌లోని వీధి ప్రైడ్ హోటల్‌కు వచ్చి ఆరా తీశారు. 407 రూమ్‌కి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. చందానగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రూమ్‌లో ఓ కాగితంపై నా చావుకు నేనే కారణం అని రాసి ఉన్న కాగితాన్ని గుర్తించారు. భార్య ఉషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతికి సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మియాపూర్ : గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... లింగంపల్లిలోని కల్లు దుకాణం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (52) అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని స్థానికులు చందానగర్ పోలీసులకు గత నెల 24న ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తి గురించి చుట్టుపక్కల ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో పోలీసులు చికిత్స నిమిత్తం ఆ వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం

శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్



రాయదుర్గం: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో చేపట్టే నిర్మాణాలన్నింటిలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సర్కిల్ ఈఈ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్‌హిల్స్ కాలనీలో రూ.19 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు ప్రాంతాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా, ప్రధాన రోడ్లను బీటీరోడ్లుగా మారుస్తున్నామన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మాదాపూర్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మాల్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని సిద్దిక్‌నగర్ రోడ్ నంబర్ 5, ప్లాట్ నంబర్ 217లో నివాసముంటున్న ఎండీ జహీరుద్దీన్(22) విద్యార్థి. ఉదయం 5.30 నిమిషాల ప్రాంతంలో ఉరివేసుకున్నట్టు తెలిపారు. తన అన్నయ్య ఫయాజుద్దీన్, స్విగ్గి డెలివరీ బాయ్ చూసి చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'సీఎస్ఆర్ నిధులతో చేసిన అభివృద్ధి ఎంత?'

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్

పటాన్‌చెరు: సీఎస్ఆర్ నిధులతో పటాన్‌చెరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఎంత అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ ప్రశ్నించారు. బుధవారం మండల పరిధిలోని ముత్తంగి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే కాకముందు ఎంత ఐటీ చెల్లించారు.. ప్రస్తుతం ఎంత చెల్లిస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని శివనగర్ నుంచి చిన్నకంజర్ల గ్రామానికి వెళ్లే మార్గంలో ఎమ్మెల్యేకు సంబంధించిన క్రషర్ల నుంచి లారీలు తిరగడంతో రోడ్డు గుంతలుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, ఎస్ఆర్‌కె యువసేన నాయకులు రాజు, గోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మియాపూర్ : చందానగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజ లు చేశారు. పూజా కార్యక్రమానికి బీజేపీ శేరిలింగంపల్లి పాలక్, మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్యగౌడ్ హాజరయ్యారు. ఆ పార్టీ నాయకులు అసెంబ్లీ కన్వీనర్ కె.రాఘవేందర్‌రావు, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, మొవ్వా సత్యనారాయణ, నరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డిలు ఆయన్ని సన్మానించారు. అనంతరం పార్టీ అసెంబ్లీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.

'స్కూల్ సేఫ్టీ క్లబ్' ప్రారంభం

గచ్చిబౌలి: గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బుధవారం స్కూల్ సేఫ్టీ క్లబ్‌ను మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి ప్రిన్సిపల్ శారద, వైస్ ప్రిన్సిపల్ వాసవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఎప్పుడూ ధైర్యంగా ఉండాలన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు తమ భద్రత గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థి దశలో లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు.అనంతరం బాలికలు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, గాయత్రి గచ్చిబౌలి ఎస్ఐ రాధాకృష్ణ , అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకే తొలిమెట్టు

జిల్లా విద్యాధికారి రాజేశ్



తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను డీఈఓ రాజేశ్‌కు వివరిస్తున్న ఉపాధ్యాయులు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేందుకు టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ఉపయోగించి బోధించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి రాజేశ్ సూచించారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాలులో పటాన్‌చెరు, అమీన్‌పూర్ రెండు మండలాలకు సంబంధించి టీఎల్ఎం మేళాను ఎంఈఓ రాథోడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈఓ రాజేశ్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, ఎంపీపీ సుష్మశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ రాజేశ్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో టీఎల్ఎం ప్రదర్శన మేళా చక్కగా జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంలను పరిశీలించారు. పాఠశాలల్లో టీఎల్ఎం ఉపయోగించి బోధిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. మండల స్థాయిలో టీఎల్ఎం మేళా జరిగిందని, త్వరలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ మేళా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ పీపీ రాథోడ్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు, అమీన్‌పూర్ రెండు మండలాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలను 270 ఎగ్జిబిట్స్ వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మియాపూర్: మియాపూర్‌లోని నడిగడ్డతండాలో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి శత జయంతి వార్షికోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్ మాట్లాడుతూ.. ఈ నెల 9న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వేడుకలు జరుగుతాయని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, కార్యదర్శి సభ్యులు దానయ్య, పుష్ప, నర్సింహ, దశరథ్ నాయక్, పల్లె మురళి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాలనీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుధ్యం అమలులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. పారిశుధ్యంపై కాలనీ నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తిలావత్, సంపత్ గౌడ్ పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్‌లో సైబరాబాద్ ,ఉమ్మడి రంగారెడ్డిజిల్లాకు ప్రథమ స్థానం

- నెలరోజులపాటు స్పెషల్ డ్రైవ్
- సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ కవిత



సైబరాబాద్ కమిషనరేట్‌లో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో పాల్గొన్న వారితో డీసీపీ కవిత

రాయదుర్గం: ఆపరేషన్ స్మైల్‌లో రాష్ట్రంలో సైబరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ కవిత పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశంపై బుధవారం ఆపరేషన్ స్మైల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవరిలో ఆపరేషన్ స్మైల్ ఉంటుందన్నారు.ఆపరేషన్ స్మైల్ డ్రైవ్‌లో భాగంగా గత ఏడాది 14 ఏళ్లలోపు వయస్సున్న 1072 మంది వీధి బాలలను రెస్క్యూహోమ్‌కు తరలించామన్నారు. చిన్నారులను ఎలా రక్షించాలనే అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో రంగారెడ్డిజిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, రంగారెడ్డిజిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డా.సుజన, బచపన్ బచావో ఆందోళన్ ఇన్‌చార్జీ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ డా. శైలజ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.